# కోరిక

పాలకోడేటి సత్యనారాయణ రావు



కరడుగట్టిన హృదయంతో దారిదోపిడీలు చేసినవాడు క్షణకాలంలో మంచివాడయి, చెట్టుమీది పిట్టలపట్ల జాలితో 'మానిషాద !' అంటూ కవిత్వంచెప్తాడని ఎవరూహించారు ? శోకంతోశ్లోకం పెల్లుబికిరావటం ఆ మనిషి మనీషిగా ఎదగటంలోని ఓ అవస్థ. ఆ తర్వాత వాల్మీకిగాథ మనకెంతో సుపరిచితంఅయింది. ఆయన రాసినకావ్యం పారాయణగ్రంథం అయింది.

వనమాలినిచూసినపుడు నాకు ఆ వాల్మీకే గుర్తొకొచ్చాడు. లేకుంటే వనమాలిఏమిటి, వేదాంతం చెప్పడంఏమిటి ?

వేదాంతం చెప్పగలిగేవాడికి, పోనీ, చెప్పే వాడికి కొన్నిఅర్హతలుఉండాలని రూలేమీలేదు, ఉన్నట్టూలేదు. ఈ రోజుల్లో, రోజుకో స్వామీజీయో, ఇద్దరో ముగ్గురో బాబాలో అక్కడో ఇక్కడో ఆవిర్భవిస్తున్నట్టు మన కెన్నోవార్తలుదాఖలాలు ఉంటున్నాయి. 'గీత' బాగుండి కొందరు, వారి 'చేత'లుబాగుండి మరికొందరూ పాంకోళ్లలో పాదవారులై తిరగాల్సినవాళ్లు హెలికాప్టర్లలో సంచారం చేసేస్థితికి ఎదిగిపోతున్నారు. ఆ తర్వాత వారేదిచెప్పినా, దానికి పేరుమాత్రం అటు వేదాంతమో, ఇటు ప్రవచనమో అయిఉండి తీరాలి. ఇంతఎత్తుకు ఎదిగేందుకు ఆస్వాముల వాళ్ళు జీవితంలో ఎంతకృషిచేశారో, ఎన్ని పరీక్షలలో కృశించారో నాకుతెలీదు.

వనమాలిమాత్రం ఈ స్థితికి ఎదిగేందుకు ఎంతగానో కృషిచేశాడు. బోలెడంతజీవితాన్నీ, బోలెడురూపాయిల్నీ త్యాగంచేశాడు. ఆఖరికి.. ఆఖరికి... ఏం మిగిలింది— ఏమీ మిగలదనే వేదాంతం మిగిలింది !

చాల రోజులక్రితం వనమాలి నా దగ్గరికి వచ్చాడు. ఆ రోజు ఆదివారం. సెలవుకావడంతో బద్ధకంతో పెరిగినగెడ్డంతో ఈజీ ఛెయిర్‌మీద కాళ్లు బార్లాజాపుకొని పేపర్లోని అనుబంధంలోని విశేషాలు చదువుకొంటున్నాను. వనమాలిరావటంతోనే మా ఆవిడ కాఫీఇచ్చింది. ఆ కాఫీ సిప్పింగ్‌అయిపోయాక, వనమాలి ముంతతీసి బయటపెట్టాడు.

"చిన్నసాయం చేసిపెట్టాలిరా !" అన్నాడు వనమాలి. చెప్పమన్నాను. అది చిన్నసాయం కాదనిపించింది, వాడు చిన్నసాయం అనేఅన్నా! ఒక చిట్‌ఫండ్‌కంపెనీలో చిట్ తీసుకొంటాడట. దానికి నేను 'మావాడు తప్పకుండా తీర్చేస్తాడంటూ గ్యారంటీఇవ్వాలిట. పేరుకు అది గ్యారంటీయో, ష్యూరిటీయో అయినా నిజానికి అది ఆ'అప్పు' నేనుతీరుస్తానని ఒప్పుకోవటమే అవుతుందని నాకు తెలుసు. అదే అన్నాను నవ్వుతూ.

"కావాలంటే ఓ అయిదువందలు అప్పుగా ఇస్తాను. తీసుకెళ్ళు. తీర్చకు ! ఫర్వాలేదు. కానీ, ఇదేమిట్రా...!

వనమాలి అలాకాదన్నాడు. "నేను ఇంకా చిట్ తీసుకోలేదు. నువ్వు ఊఅంటే చేరతాను, ఏనెలవస్తుందో తెలీదు వచ్చేనెల అయినా, నలభయ్యవ నెలైనాసరే ష్యూరిటీ మాత్రం ఇస్తానను !"

ఊ అన్నాను. వనమాలితో ఉన్నచనువు, పరిచయం అలాటివి. ఆ తర్వాత అడిగాను: "ఏం చేస్తావురా ఆ డబ్బుతోటి ?" అంటూ.

అటు తలుపుపక్కన నా శ్రీమతివింటోంది అతిశ్రద్ధగా, ఏం చెప్తాడోనని. వనమాలి అలా వెళ్ళిపోగానే ఇలా నామీద విరుచుకుపడేందుకు సిద్ధంగాఉంటుంది— 'చూశారా, వీరికి వనమాలి అన్నయ్యసైతం...' అంటూ మొదలుపెట్టి, ఈ దేశంలో నాఅంత పనికి రానివాడు ఇంకోడులేడని తీర్మానించేస్తుంది. అది నాపైన అభిశంసనేఅయినా నేనూ ఆ తీర్మానానికి ఆ క్షణంలో తలవంచక తప్పని స్థితి అవుతోంది.

"ఫ్రిజ్ కొందామనుకొంటున్నానురా !"

ఉలిక్కిపడ్డాను, సరిగ్గానేవిన్నానా? రిఫ్రిజిరేటరా ? ఎందుకు ??

"ఏందుకంటే ఏం చెప్పను ? దానివల్ల ఉన్న ఉపయోగాలు అన్నా, ఇన్నా?...వారానికి ఒక్కసారి కూరలు ఏ మార్కెట్‌కోవెళ్ళి తెచ్చుకొంటే ఇంక మళ్ళీ ఓ పదిరోజులవరకూ చూసుకోనఖ్కర్లేదు. వారం కూరలే అయినా ఒకసారికొంటాం కాబట్టి, అవి పదిరోజుల వరకూ వస్తాయి. బోలెడంతడబ్బు ఆదా, పైగా కూరలన్నీ వాడిపోకుండా ఉంటాయి !"

నవ్వొచ్చిందినాకు.

"నువ్వు మాంసమ్మైనా తినవుగదరా, నిలవ చేసుకోవటానికి ? ఆఖరికి గుడ్డు కూడా మాంసాహారమే అంటావునువ్వు. నీకు ఫ్రిజ్ అంత ఉపయోగపడదేమో !" అన్నాను నేను.

వనమాలి ఒప్పుకోలేదు "అబ్బే, నేనెంతో ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చానురా !" అన్నాడు.

సరే, ఎవడిగొడవ వాడిది అనుకొన్నాను. సరి పెట్టుకొన్నాను. పైగా నిశ్చింతగానూ నిట్టూర్చుకొన్నాను వనమాలి 'ఫ్రిజ్'అన్నాడు కాబట్టి సరిపోయింది అదే, ఏ ఇంటిస్థలమో అనిగాని అనిఉంటే నా దుంపతెగిపోయిఉండేది పదేళ్ళుగా ఉద్యోగంచేస్తున్నా పనికివచ్చేపని ఒకటీచెయ్యలేదని మా ఆవిడ నాకు రోజుకో సారిఅయినా సర్టిఫికేట్ ఇస్తుంటుంది. 'పనికివచ్చేపని'అంటే స్థలంకొనటం ఒక్కటే నని ఆవిడగారి నిశ్చితాభిప్రాయం.

"ఏం చేస్తారండీ ఫ్రిజ్‌తోవాళ్ళు !"అంది సుశీల ఆశ్చర్యంతో, వనమాలి వెళ్ళిపోయాక.

"ఏం చేస్తారేమిటి మొదటిసారి వెళ్ళినపుడు బహుశా ఏ ఐస్‌క్రీమో ఇస్తారు రెండో సారి కూల్‌డ్రింక్ పేరిట చన్నీళ్ళు ఇస్తుండొచ్చు. ఆ తర్వాత... 'ఏమిటో, ఈ కరెంటుతో ఒకటే గొడవగాఉంది. ఎపుడూ లో వోల్టేజీయే...'అంటూ ఉపన్యాసంఇస్తాడు !" అన్నానునేను నవ్వుతూ.

సుశీలకూడా నవ్వేసింది.

ఓ రెండు మూడు నెలలతర్వాత వనమాలి చిట్‌ఫండ్ కంపెనీవాళ్ళ షూరిటీ పేపర్లతో వచ్చాడు సంతకం పెట్టమంటూ. "త్వరగానే వచ్చేసిందే !"అన్నాను నేను ఆ కాగితాలమీద సంతకాలు పెడుతూ.

"సర్లె, త్వరగావచ్చిందంటే రాదూ, రెండొందలు అమ్ముకొంటేను !" అదేమిటన్నాను.

"ఈ నెల ఇంకోరెవరికోవచ్చింది. నాకు మార్పిడీచెయ్యటానికి రెండొందలు అడిగారు, ఇచ్చాను !"

"కానీ అంతనష్టపోవటం... ?"

"నష్టమేమిటి, నాన్సెన్స్ ! ఇపుడు ఏనెల ? జనవరికదా ! ఫిబ్రవరి నెలాఖరు రోజును మర్చిపోయావేం ? ఆ రోజును నేను మాత్రం మర్చిపోలేదు."

"ఏమిటి, నీ బర్త్‌డేయా కొంపదీసి ?"

"ఛ, అదేంకాదు, ఆరోజే బడ్జెట్‌ను పార్లమెంటులో పెట్టేది అంటే ఏమిటి ? మేము అన్నిటిమీదా పన్నులుపెంచుతున్నామని దండోరావేసి చెప్పటమన్నమాట ! మిగతా అన్నిటిమాట ఎలాఉన్నా, రిఫ్రిజిరేటర్‌మీద ఎంతలేదన్నా ఓ రెండు వందలన్నా వేస్తారు పన్నులు ... !"

ఉలిక్కిపడ్డాను. రెండొందలా ?

"ఆ—అసలే అది లగ్జరీ అయిటం. దాని మీద ఎక్సైజు అని, సేల్స్‌టాక్స్ అనీ, డ్యూటీఅనీ, లోకల్‌టాక్సులనీ..." 'నేను వినటం మానేశాను. అయినా మనసు చావ లేదు. మరోసారి ప్రయత్నించి చూడమంది. చిన్నగా అన్నాను— "లగ్జరీ అంటున్నావ్‌కదా, మరి నీకెందుకురా?"

వనమాలి నవ్వాడు. "పెద్ద పెద్ద లగ్జరీలు ఎన్నో ఉన్నాయి దేశంలో. కొందరికి ఫ్యాక్టరీలు ఉన్నాయి కొందరికి విమానాలు వున్నాయి. మరికొందరికి ఓడలున్నాయి. ఇంకొందరికి లంకంత ఇళ్ళున్నాయి నేను ఇవేవీ అడగటంలేదు ఆఫ్టరాల్, నాలుగు... నాలుగున్నర వేలు పెడితే వచ్చే ఓ ఫ్రిజ్ ." అంటూ వనమాలి అన్నిరకాల ఫ్రిజ్‌ల రేట్లూ, వాటిలో వుండే తేడాలూ చెప్పటం ఆరంభించాడు.

నిజమే, వనమాలి అన్నట్లు ఇది చిన్న కోరికే. కొందరికి ఇళ్ళు కట్టుకోవాలని, కొందరికి నోట్లు నింపుకోవాలని...ఇంకా కొందరికి రోజూ అయిదారు సీసాలు తాగాలని ...జిహ్వాకోరుచి... వనమాలికీ కోరిక...పోనీ, తీరిపోతోంది గదా అనుకొన్నాను, అన్నాను కూడానూ !

"థాంక్స్‌రా — ఇంకో పది, పదిహేను రోజుల్లో మళ్ళీకలుస్తాను. పార్టీకి పిలుస్తాను. ఫ్రిజ్‌లోంచి తీసి..." నవ్వేశాడు వనమాలి.

వాడు అన్న పది పదిహేను రోజులూ గడిచిపోయాయి. నెల రోజులూ గడిచిపోయాయి. వనమాలి ఏదో హడావిడిలో వుండి వుంటాడని నేను పార్టీ విషయం అడగలేదు. మార్చినెల వచ్చేసింది. వేసవి ఆరంభం అయింది.

ఎండల్ని చూస్తుంటే వనమాలి మంచి పనే చేశాడనిపించింది. ఎండలో తిరిగి ఇంటికి రాగానే గుక్కెడు చల్లటి అయిస్ వాటర్ తాగగల్గటం అదృష్టమే అనుకొన్నాను.

సుశీల చిన్నగా అందోరోజు : "మీ వనమాలి ఇంటికి వెళ్దామండీ ! వెళ్ళి కూల్‌డ్రింక్ తాగివద్దాం !"

సరేనని, వాడు పిలవకపోయినా పయనం కట్టాం. ఆప్యాయంగా పలకరించాడు, ఆదరంతో మాటాడాడు. కానీ ఎంతైనా కూల్‌డ్రింక్ ఇవ్వలేదు. ఫ్రిజ్‌నూ చూపించ లేదు. వీడ్కోలు తీసుకొంటూ అడిగేశాను ' "ఏదిరా, నీ ఫ్రిజ్ చూపించనే లేదు !...'

వనమాలిముఖం చిన్నబోయింది తమాయించుకొంటూ అన్నాడు: "సారీరా, నీకు చెప్పనే లేదూ గదా! ఆ డబ్బుతో నేను ఫ్రిజ్ కొనలేదు!"

"మరేం చేశావ్ అంత డబ్బునూ!"

"సూర్యం స్కూటరు కొనుక్కుంటానంటే ఇచ్చేశాను!"

ఆశ్చర్యపోయాను- సూర్యం అంటే వనమాలి వాళ్ళ చిన్నాన్న కొడుకు మొగుడూ పెళ్ళాం ఇద్దరూ వుద్యోగాలు చేస్తున్నా ఇంకా వాళ్ళకు దరిద్రమేనేమో! ఆఖరికి వనమాలి దగ్గర చేరారు. ఆ డబ్బు ఇక వస్తుందనుకోవటం వనమాలి తెలివి తక్కువతనం.

"వాడు అలాంటి వాడు కాదురా, ఇచ్చేస్తాడు." అన్నాడు వనమాలి,

కానీ సూర్యం నా మాటానూ, ఇటు వనమాలి మాటనూ రెంటినీ అబద్ధం చేసి పారేశాడు రెండు వేలవరకూ తీర్చి ఆ తర్వాత సూర్యం ఎగనామం పెట్టేశాడు. ఎటొచ్చీ ఇంకా ఆ మాట ఇంకా స్పష్టంగా అనలేదు. 'ఇదిగో ఇస్తా' 'అదుగో ఇస్తా' నంటూ ఆఖరికి నెత్తిమీద కొంగుపర్చటం చాల మందికి వెన్నలో పెట్టిన విద్య ! ఆ సంగతి నా కెవరూ చెప్పనక్కర్లేదు అయిన వాళ్ళకే డబ్బు అప్పుఇచ్చి, ఆఖరికి ఆ దౌర్భాగ్యులు నాడబ్బుతో స్థలాలుకొనుక్కొని కులకటం నా జీవితంలోనే ఓ అధ్యాయం !

-రెండేళ్ళు గడిచాయి. వనమాలి నెలనెలా చిట్ కడుతూనేఉన్నాడన్నది నాకుతెలుస్తోంది.

వనమాలి ఇపుడు రెండోచిట్ కడుతున్నాడు. జీవితంలో రవ్వంతడబ్బును ఒకే సారిచూడాలంటే చిట్స్‌కుమించిన అవకాశం లేదని వనమాలికి అర్థంఅయింది. అందుకే

మీకు బేబీ/బాబు కావాలా




ఆపరేషన్, ఇతర వైద్య చికిత్సలతో నిరాశ చెందిన సోదరీమణులు అనేకులు మా సలహాలచే సంతానవతులయి ఇచ్చినయోగ్యతా పత్రములు గలవు. స్త్రీ పురుష వంధ్యాదోష నివారణా నిపుణులు. ఉచిత వివరములకు:

శ్రీ నాగార్జున మూలిక కుటీరం,

రామాలయం వీధి, తెనాలి—2. | 2వలైను, కేదారేశ్వరపేట, విజయవాడ-3.



చర్మ రోగం పోకిందా?



ఉపశమనం-కల్గించే లిచెన్‌సా స్కిన్ అయింటు మెంటు నిరపాయకరంగా, శీఘ్ర నివారణ కలిగిస్తుంది.

రుజువు చేయబడిన 6 మందులుతో కూడిన నిరపాయకరమగు నాజూకైన ములాము అమోఘంగా పనిచేస్తుంది చర్మరోగాలకు, కోతలకు, పుండ్లకు...మరియు మొటిమలకు, చమటకాయలకు పొడుపుడుకాయలకు!

చర్మరోగాలు కన్పించీ కన్పించడంతోటే నిరపాయకరమైన శీఘ్ర నివారణకు లిచెన్‌సా వెంటనే ఉపయోగించండి.

లిచెన్‌సా

స్కిన్ అయింటు.మెంటు

7560 TG


## కోరిక

ఓ పూటతినీ, మరోపూట తినకా అన్న వద్ద చిట్‌లో డబ్బు నిలువవేస్తున్నాడు.

రెండోసారి చిట్‌కు నేనే షూరిటీ ఉన్నాను. వనమాలిమీద నాకు నమ్మకం పెరిగింది, అవస్థలుపడిఅయినా అన్న మాట నిలబెట్టుకొంటాడని!

"ఈరోజే చెక్ ఇస్తామన్నారు సాయంత్రం అట్నుంచి అలాగేవెళ్లి..." నాకుతెలుసు వనమాలి కోరిక!

వాడు ఈసారైనా అది తీర్చుకోగలిగితే సంతోషించేవాడిని నేనే!!

ఆ రోజు మధ్యాహ్నమే వనమాలికి ఇంటి నుంచి ఫోనొచ్చింది, అర్జెంటుగా ఇంటికి రమ్మంటూ!

''ఏమిటట సంగతి ?'' అనడిగాను.

''చెప్పలేదు ఎవరోచేశారు ఫోన్ ఏముంటుంది, ఎవరో వచ్చిఉంటారు ఇంటికి!'' అన్నాడు వనమాలి ''అయినా అర్జెంటు అంటున్నారుకదా, వెళ్తున్నాను!''

వనమాలి మూడురోజులతర్వాతే మళ్ళీ ఆఫీసుకువచ్చాడు— ఆ రోజు ఆఫీసునుంచి అర్జెంటుగావెళ్ళటం అదృష్టమన్నాడు. ఇంటికి వెళ్ళేసరికి వనమాలిభార్య రుక్మిణి కడుపునొప్పంటూ ఒకటేగోలట! ఆస్పత్రికి తీసుకెడితే అపెండిసైటిస్ అన్నారట. వెంటనే ఆపరేషన్ అవసరంఅంటే వనమాలి 'ఊ'అన్నాడు.

అంతే—

నాకు మిగిలినకథంతా అర్థమయిపోయింది! అయినా వనమాలిని నేనేమీ అడగనేలేదు.

వనమాలి నెల నెలా చిట్సు కడుతూనే ఉన్నాడు, కోరికలగుర్రానికి కళ్లాలు లాగుతూనే ఉన్నాడు

ఉండబట్టలేక ఈ మధ్యనే వనమాలి కనిపిస్తే అడిగాను నేను నవ్వుతూ;''ఏమయింది నీ ఫ్రిజ్ ?''

వనమాలి నవ్వేశాడు "నీ కసలు బొత్తిగా బుర్రలేదురా! మనమేమిటి మధ్యతరగతి జనాలం! మనకెందుకు చెప్పు ఫ్రిజ్ ? ఏం చేస్తాం ? మనం తాగుడుకు అలవాటుపడ్డ వాళ్ళం కాము. మాంసం తినం, గుడ్లు ముట్టం. కూరలంటావ్ — రోజూ తాజాగా ఎందరో కూరలు అమ్ముతుంటే వాటిని కాదని, వారానికి ఒకసారి తెచ్చుకుని నిలువ వేసుకొని తినటం ఏం తెలివైన పని ? అసలు నన్ను అడిగితే ఫ్రిజ్ అంతటి దండగ వస్తువు ఇంకోటి లేనేలేదు...!''.

— వనమాలి ఇపుడు వేదాంతం చెప్తున్నాడు. తనకు అందని పళ్ళన్నీ పుల్లనివే అంటున్నాడు. తాను అందుకోలేనిది పనికి మాలినవేనని ఆత్మవంచన చేసుకొంటున్నాడు!

కోరికలు పెంచుకోవటంలో, వాటిని సాధించుకోవాలనుకోవటంలో తప్పులేదు. సాధించుకోలేనపుడు మాత్రం వేదాలు వల్లించడం మాత్రం తప్పనిపిస్తోంది. కానీ ... వనమాలి మామూలు మనిషి. తన మనసుకు తానే సమాధానాన్ని చెప్పుకుంటున్న అతి సాదా మనిషి!!

వనమాలి అంటున్నదానిలో తప్పేమీ నాకు కనిపించటంలేదు.

— ఆ రోజు సాయంత్రం ఓ చేతో తాజా కూరలు నిండిన సంచీతో, మరోచేతో కూజాతో ఇంటికొస్తున్న వనమాలిని చూస్తే నాకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి!!

### జీతం — జీవితం

ఎన్నిరాళ్లు
వచ్చినా
చాలని
పెంచనిది
జీతం.
ఎన్నిఏళ్ళు
వచ్చినా
చావాలని
పెంచనిది
జీవితం.

### డబ్బు

అన్నిటిని
కొనడానికని
తన్ను
సృష్టించిన
మనిషినే
తాను
కొంటున్నది
డబ్బు
అదే
దానికున్న
జబ్బు.

"జోశ్యభట్ల"